సాక్షి చిత్తూరు

ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



పట్టు చీరల కోసం 'కంచి'కి..
పట్టు చీరలు కొనడానికి బెంగళూరు నుంచి కంచికి బయల్దేరిన కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. - 8లో



కౌండిన్యలో ఇసుక మాఫియా
పలమనేరు సమీపంలోని కౌండిన్య నదిలో ఇసుక మాఫియా విజృంభించి, తెల్ల బంగారాన్ని కొల్లగొడుతోంది. - 8లో



తిరుమలలో 'కూటమి' తట్టలు!
తిరుమలలో కూటమి నేతలు తట్టల పేరుతో అనధికార వ్యాపారాలు చేస్తూ, సరికొత్త దందాకు శ్రీకారం చుట్టారు. - 8లో

పేద విద్యార్థులకు అన్యాయం



వైద్య విద్యను దూరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలుస్తోంది. ఇలా చేయడం వల్ల ఎలాంటి లాభం కలుగుతోందో అర్థం కావడం లేదు. నాలాంటి ఎంతో మంది పేద విద్యార్థులు నీట్ సీటు వస్తుందనే ఆశతో పరీక్షకు ప్రిపేర్ అయ్యాం. తీరా ఇప్పుడు చూస్తే మెడికల్ సీట్లు తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. నాలాంటి లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు కష్టపడి చదివి నీట్ సీటు వస్తుందని పెట్టుకున్న ఆశలు ఆవిరవ్వాల్సిందేనా. ప్రభుత్వం సీట్లు కుదించకుండా న్యాయం చేయాలి.

– గణేష్, నీట్ విద్యార్థి, చిత్తూరు



ప్రభుత్వ మెడికల్ కళాశాలలు అవసరం



నాలాంటి పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు డొనేషన్‌లు కట్టుకోలేక నీట్ ద్వారా సీటు సాధించేందుకు పరీక్షలు రాస్తారు. నాలాంటి పేదలకు ఎంబీబీఎస్ చదవాలంటే ప్రభుత్వ కళాశాలలు చాలా ముఖ్యం. ప్రైవేట్ యాజమాన్యాలతో కళాశాలలు నిర్వహిస్తే వైద్య విద్య పేదలకు భారంగా మారుతుంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త మెడికల్ కళాశాలలను ప్రారంభించి పేద, మధ్య తరగతి విద్యార్థులకు మేలు చేయాలి. ఫీజుల భారం విద్యార్థుల మీద పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– బాలాజీ, నీట్ విద్యార్థి, చిత్తూరు

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులకు అర్హత, ఆసక్తి ఉన్న ప్రభుత్వ టీచర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇన్ సర్వీస్‌లో ఉన్న స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రత్యామ్నాయ సహిత విద్య కో–ఆర్డినేటర్ పోస్టుకు పాఠశాల సబ్జెక్టులతో పోస్టు గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత, సహిత విద్య కో–ఆర్డినేటర్ పోస్టుకు పాఠశాల సబ్జెక్టులో పీజీ, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డీఈడీ, బీఈడీ, ఎంఈడీ, 45, 90 రోజులు స్పెషల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ కోర్సు పూర్తి చేసి ఉండాలన్నారు. ఈ రెండు పోస్టులకు స్కూల్ అసిస్టెంట్‌గా కనీసం ఎనిమిదేళ్ల సర్వీస్, నోటిఫికేషన్ నాటికి 55 ఏళ్ల వయసు మించి ఉండకూడదని తెలిపారు. కంప్యూటర్ స్కిల్స్ తప్పనిసరి అని అన్నారు. అసిస్టెంట్ ఏఎంఓ పోస్టుకు పాఠశాల సబ్జెక్టులతో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో ఉత్తీర్ణత, స్కూల్ అసిస్టెంట్‌గా ఐదేళ్ల సర్వీస్, నోటిఫికేషన్ నాటికి గరిష్టంగా 55 ఏళ్ల వయసు మించి ఉండకూడదని తెలిపారు. అసిస్టెంట్ ఏఎంఓ పోస్టుకు కంప్యూటర్ స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. దరఖాస్తులను అందజేసేందుకు ఈ నెల 23 చివరి తేదీ అని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో పనిదినాల్లో అందజేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులు స్వీకరించేదిలేదని వెల్లడించారు. ఇతర వివరాలకు జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయంలో సంప్రదించాలని ఏపీసీ తెలిపారు.

రాజీమార్గంలో కేసుల పరిష్కారం ప్రధానం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు అర్బన్: పట్టింపులకు పోయి కేసు ఎవరు ఎవరు గెలిచారనేది చూడొద్దని, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడమే ప్రధానమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు తెలిపారు. ఆయన శనివారం చిత్తూరు న్యాయస్థానాల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునే కేసుల్లో గెలుపోటములు ఉండవన్నారు. అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసులపై అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండదన్నారు. ఉమ్మడి జిల్లాలో 13 చోట్ల, 35 బెంచ్‌లను ఏర్పాటు చేసి 9259 కేసులను పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇక్కడ భూ సమస్యలు, రాజీ చేసుకోదగ్గ క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్, ఎక్సైజ్, బ్యాంకు, ప్రైవేటు చిట్ ఫండ్, విద్యుత్, నీటి బిల్లులు, బీమా సంస్థలు, రెవెన్యూ కేసులను పరిష్కరించుకునే వెసులుబాటు ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెన్నెల, న్యాయమూర్తులు రమేష్, శ్రీదేవి, ఉమాదేవి, శ్రీనివాసులు, మాధవి, బాబాజాన్, పద్మజ, బార్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రరెడ్డి, అశోక్ ఆనంద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రథం ముందు సాగుతున్న దండాయుధ సేన



భక్తజన సందోహం మధ్య రథంపై ఊరేగుతున్న వినాయక స్వామి



నేత్రపర్వం రథోత్సవం

వరసిద్ధుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. రోజుకో వాహనంపై విహరించిన గణపయ్య శనివారం రథంపై ఊరేగారు. విఘ్ననాథుడి రథాన్ని లాగేందుకు భక్తులు వేలాదిమంది తరలివచ్చారు. రథంపై దివ్యతేజస్సుతో వెలిగిపోతున్న ఆది దేవుడిని దర్శించుకుని పులకించిపోయారు. కాణిపాకం వీధులు భక్తజనసందోహంతో కిక్కిరిసిపోయాయి. అశేష భక్తజనం మధ్య వినాయకుడి రథం ముందుకు కదిలింది.

- కాణిపాకంలో వేడుకగా బ్రహ్మోత్సవాలు
- తరలివచ్చిన భక్తజన సందోహం
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

కాణిపాకం: కాణిపాకంలో రథోత్సవం కనులపండువలా సాగింది. సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి రథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు సంప్రదాయబద్ధంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఉదయం సర్వాలంకార భూషితులైన సిద్ధిబుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవమూర్తులను ఆలయ అన్వేటి మండపంలో ఉంచి విశేష సమర్పణ చేశారు. అశ్వాలు, ద్వారపాలకులను, పుష్పాలను స్వామి రథానికి అలంకరించారు. అనంతరం పుణ్యాహవచనం, వాస్తు, రథసారథి ప్రతిష్ట, రథబలి, కూష్మాండ బలి పూజల చేశారు. మేళతాళాల మధ్య ఆలయం నుంచి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై అధిష్టింపచేశారు. ఉభయదారుల నుంచి ఉభయం వచ్చిన అనంతరం స్వామివారి రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపునకు సిద్ధం చేశారు.

బందోబస్తుతో రథోత్సవం

భారీగా తరలివచ్చిన భక్తజనసదోహం నడుమ సాగిన వరసిద్ధుని రథోత్సవానికి పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టారు. డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

భక్తజన సందోహం

ఉదయం నిర్ణీత సమయంలో రథాన్ని కదిలించి వదిలారు. రథంపై కొలువైన గణపయ్య మధ్యాహ్నం 3.05 గంటలకు విహారానికి బయల్దేరారు. భక్తుల నామస్మరణలతో స్వామి వారి రథం ముందుకు కదలింది. పలు వాయిద్యాలు, నృత్యప్రదర్శనలతో రథం ముందుకు సాగింది. స్వామివారు రథంపై ఊరేగుతూ దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు. కనులారా స్వామిని దర్శించుకున్న భక్తులు రథంపై బొరుగులు, మిరియాలు, నాణేలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుకల్యాణం, అశ్వవాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుకల్యాణంతో పాటు అశ్వవాహన సేవ ఉంటుందని ఆలయ ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఉదయం భిక్షాండి, అభిషేకం, తిరుకల్యాణం జరుగుతుందన్నారు. రాత్రికి అశ్వవాహన సేవ ఉంటుందన్నారు. ఈ సేవలకు కాణిపాకం, తిరువణంపల్లె, వణిగి వంశస్తులు, 44 బొమ్మసముద్రం, తిరువణంపల్లి, చింతమాకులపల్లి, గోనుగుగుంట బలిజ కులస్తులు ఉభయదారులుగా వ్యవహరించానున్నారని ఆయన పేర్కొన్నారు.



రథం ముందు సాగుతున్న అశ్వదళం



కుందెలపై నాట్యం చేస్తున్న కళాకారులు



సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారులు



బ్రహ్మోత్సవంలో కోలాట ప్రదర్శన



రథోత్సవంలో కళాకారుల ప్రదర్శన

గమ్యం చేరని బతుకులు..!

- మృతులంతా మధ్య తరగతి కుటుంబాలే
- చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి
- ఒక్కొక్కరిది ఒక్కో కన్నీటి వ్యథ
- ఘాట్ ప్రమాదం మిగిల్చిన గాయం

చిత్తూరు అర్బన్: బంగారుపాళెం–మొగిలి ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబ సభ్యులను కదిలిస్తే ఎవరికైనా కన్నీళ్లు ఆగవు.

గమ్యం చేరకనే...

రోడ్డు ప్రమాదం జరిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోయినవాళ్లు నిజంగా దురదృష్టవంతులే. ఎందుకంటే ఇనుప కమ్మీల లోడుతో వస్తున్న లారీ మరో ఏడు నిముషాల్లో బంగారుపాళ్యంలో గమ్యం చేరుకుని ఆ లోడును దించేయాల్సి ఉంది. మొగిలి ఘాట్ పల్లం కావడంతో లారీని న్యూట్రల్ చేయడం, ఒక్కసారిగా వేగం రెట్టింపైన లారీ, బ్రేకులు వేసినా ఆగకపోవడంతో సోనూకుమార్ కంగారుపడి స్టీరింగ్‌ను పూర్తిగా కుడివైపు తిప్పేసినట్లు తెలుస్తోంది. డివైడర్‌ను దాటుకున్న లారీ దాదాపు వంద కి.మీ వేగంతో ఆర్టీసీ బస్సును ఢీకొట్టినట్లు పోలీసులు ప్రాథమికంగా తేల్చారు. లారీ డ్రైవర్ వాహనాన్ని న్యూట్రల్ చేయకుంటే ఏడు నిముషాల్లో బంగారుపాళెంలోని గమ్యానికి చేరిపోయేవాడు. తాను ఒకటి అనుకుంటే, విధి మరోలా తలిచింది. దీంతో లారీ డ్రైవర్‌తో పాటు ఆరుగురు మృత్యువాత పడ్డారు.



చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మృతదేహాల తరలింపులో నిమగ్నమైన పోలీసులు



మృతుడు బళ్లారాజు, అతని కుమారుడు శివకుమార్

అమ్మ చూడకుండానే..

ఈ ప్రమాదంలో మృతి చెందిన లారీ డ్రైవర్ సోనూకుమార్ (27) ఉత్తర ప్రదేశ్‌కు చెందిన యువకుడు. లారీలో వేసుకున్న ఇనుప కమ్మీలను బంగారుపాళ్యంలో అన్‌లోడ్‌చేసి, రెండు రోజుల తరువాత యూపీకి వస్తున్నట్లు తన తల్లికి ఫోన్‌లో తెలిపాడు. కొడుకు పనికి వెళ్లి, ఏడాది కావస్తుండడంతో బెంగ పెట్టుకున్న తల్లి, రెండు రోజుల్లో సోనూ వస్తాడని చుట్టు పక్కలవాళ్లకు చెప్పి మురిసిపోయింది. ఇంతలో మొగిలి ఘాట్ సోనూకుమార్‌ను మింగేసింది. ఇపుడు మృతదేహాన్ని చిత్తూరుకు వచ్చి తీసుకెళ్లాలో..? ఇక్కడే అంత్యక్రియలు చేయాలో సోనూ కుటుంబ సభ్యులు వచ్చి తేలుస్తారని ఇతని సన్నిహితులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

మొక్కు చెల్లించుకోవడానికి వెళుతూ..

తెలంగాణ రాష్ట్రం నిర్మల్‌కు చెందిన బళ్లరాజు (55) స్థానికంగా ఫొటోగ్రాఫర్. తన చిన్న కొడుకు శివకుమార్ బీఎస్సీ (స్టాటిక్స్) పూర్తిచేసి, విదేశంలో ఎంఎస్‌లో సీటు దొరికింది. పేద కుటుంబంలో ఉన్న తమను కరుణించిన దేవుడి దర్శనార్థం బళ్లరాజు, అతని కొడుకు శివకుమార్‌తో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. బెంగళూరు సమీపంలో ఉన్న తుముకూరులో చౌడేశ్వరీదేవీని దర్శించుకోవాలని భావించి బస్సులో ఒకే సీట్లో పక్కపక్కన కూర్చున్నారు. మొగిలి ఘాట్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో శివకుమార్ బస్సు నుంచి బయటపడడంతో కాలి ఎముక విరిగింది. బళ్లరాజు మాత్రం సీట్ల మధ్య ఇరుక్కుపోయి మృతి చెందాడు. గాయపడిన కొడుకు, కుటుంబ సభ్యుల సాయంతో తన తండ్రి మృతదేహాన్ని తీసుకుని నిర్మల్ బయలుదేరాడు.

బస్సెక్కిన 10 నిమిషాల్లోనే..



కుల్సాన్ బీ (ఫైల్)

వి.కోట: బెంగళూరులో కూలీగా పని చేస్తున్న కుల్సాన్‌బీ (52) బంగారుపాళెంలో ఉంటున్న కుమార్తెను చూడడానికి వచ్చి శుక్రవారం మొగిలిఘాట్‌లో మృతి చెందింది. మండలంలోని ఎంఎం కుంట గ్రామానికి చెందిన ఖాదర్‌బాషా (లేట్) భార్య కుల్సాన్‌బీకి ఏడుగురు సంతానం. ఇందులో 4 కుమార్తెలు, 3 కుమారులు ఉన్నారు. కుమారులు బెంగళూరులో పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం బంగారుపాళెంలో ఉన్న రెండవ కుమార్తెను చూడడానికి బెంగళూరు నుంచి బంగారుపాళ్యంకు వచ్చింది. తిరుగు ప్రయాణంలో బంగారుపాళెంలో బస్సెక్కిన ఆమె 10 నిమిషాల్లోనే మొగిలిఘాట్ వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందింది. శనివారం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుల్సాన్‌బీ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. దీంతో ఎంఎంకుంట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకున్న వాళ్లకు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్షను శనివారం పూర్తి చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య ఇక్కడి పరిస్థితిని పర్యవేక్షిస్తూ మృతదేహాలకు వైద్యుల సమక్షంలో శవపరీక్షలు పూర్తిచేయించారు. మృతదేహాలను వాళ్ల కుటుంబ సభ్యులకు అప్పగించారు.

క్షతగాత్రుల కన్నీటి వెతలు!

పలమనేరు: మొగిలిఘాట్‌లో తీవ్రంగా గాయపడి పలమనేరు ఏరియా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న వారివి ఒక్కొక్కరిది ఒక్కో కన్నీటి గాథలుగా ఉన్నాయి.

వెంకన్నకు మొక్కు చెల్లించుకుని..

బైరెడ్డిపల్లె మండలం పిచ్చిగుండ్లపల్లెకు చెందిన వెంకటరమణ(21) తీవ్రంగా గాయపడ్డాడు. ఇతను లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం పొద్దున తిరుమలలో స్వామి వారికి మొక్కు చెల్లించుకుని తిరుగు ప్రయాణంలో సన్నిహితుడి గ్రానైట్ లారీలో బయల్దేరి వచ్చాడు.



వెంకటరమణ



ప్రకాష్‌కుమార్ బెహ్రా



ముబారక్

ఒడిశా నుంచి వస్తూ...

ప్రకాష్‌కుమార్ బెహ్రా ఒడిశా రాష్ట్రం ఛత్రపురి తాలుకా రుకినిగోమ్ గ్రామానికి చెందిన వ్యక్తి. బెంగళూరులో తన స్నేహితుని సాయంతో అక్కడ సెక్యూరిటీ గార్డుగా పనిచేసేందుకు ఒడిశానుంచి విశాఖపట్నం మీదుగా తిరుపతికి రైలులో వచ్చాడు. అక్కడి నుంచి బస్సులో వచ్చి ప్రమాదంలో గాయపడ్డాడు.

క్లీనర్‌గా పనిచేస్తూ..

పెద్దపంజాణి మండలం మాడికి చెందిన ముబారక్(27) గ్రానైట్ లారీకి క్లీనర్‌గా వెళుతూ కుటుంబానికి ఆసరా ఉండేవాడు. బస్సు వెనుకవైపునున్న గ్రానైట్ లారీలో వస్తూ ప్రమాదంలో గాయపడ్డాడు. తన కుటుంబానికి ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఘాట్ బాధితులకు స్విమ్స్‌లో వైద్య సేవలు

తిరుపతి తుడా: మొగిలి ఘాట్ రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముగ్గురికి తిరుపతి స్విమ్స్‌లో వైద్య సేవలు అందిస్తున్నారు. వీరిని శనివారం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి స్విమ్స్‌కు తరలించారు. ఉత్తర ప్రదేశ్‌లోని బైసర్ మండలం మహారాజ్ గని ప్రాంతానికి చెందిన ఆషితోష్ కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. ఆరేళ్ల చిన్నారి అక్కడికక్కడే మృతి చెందగా ఆయన భార్య వెంకి సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో, కుమారుడు అస్మిత్ యాదవ్ న్యూరో సర్జరీ విభాగంలో చికిత్స పొందుతున్నారు. అషితోష్‌కు జనరల్ సర్జరీలో శస్త్ర చికిత్సను పూర్తి చేశారు.

క్లుప్తంగా

పట్టు చీరలు కొందామని 'కంచి'కి..




మృతి చెందిన గంగరాజయ్యగౌడ్, లక్ష్మి

బంగారుపాళెం: గృహప్రవేశం కోసం కారులో పట్టు చీరలు కొనుగోలు చేసేందుకు వెళ్తున్న ఓ కుటుంబం శనివారం బంగారుపాళెం వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. పోలీసుల కథనం మేరకు, బెంగళూరులోని దొడ్డబల్లాపూర్‌కు చెందిన గంగరాజయ్యగౌడ్ కుటుంబ సభ్యులు సుచిత్ర, ధరణి, శ్రీనివాసమూర్తి, లక్ష్మి, తనూజ, ఉష ఇనోవా కారులో తమిళనాడులోని కాంచీపురానికి బయలుదేరారు. మార్గమధ్యంలో కొత్తపల్లె బైపాస్ రోడ్డు చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రోడ్డు పక్కన గల ఏర్పాటు చేసిన గోడ(సైడ్‌వాల్)ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో గంగరాజయ్యగౌడ్(56), లక్ష్మి(35) మృతి చెందారు. శ్రీనివాసమూర్తి(51), తనూజ (36), సుచిత్ర(48), ఉషా(39), ధరణి(22) తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స కోసం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కోలారు ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బంగారు పాళెంలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడిపై దాడి

చిత్తూరు అర్బన్: నగరంలో ఒక యువకుడిపై ఐదుగురు కలిసి శుక్రవారం అర్ధరాత్రి దాడికి పాల్పడ్డారు. టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య కథనం మేరకు.. సంతపేటకు చెందిన వసంత్ తిరుపతిలోని ఓ దుకాణంలో పనిచేస్తున్నాడు. చర్చివీధిలో వసంత్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా సంతపేటకు చెందిన అరుణ్ మరో బైక్‌పై వస్తూ ఎదురుగా ఢీ కొట్టాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే వసంత్ అర్ధరాత్రి ఇంటికి వెళుతుండగా సంతపేట బ్రిడ్జి వద్ద అరుణ్ తన స్నేహితులు గిరీష్, యశ్వంత్, జయరామ్, చిట్టిబాబుతో కలిసి తీవ్రంగా కొట్టారు. ఈ దృశ్యాలను కొందరు మొబైల్‌లో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేశారు. గాయపడ్డ వ్యక్తిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ఐదుగురి నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చోరీ కేసులో మహిళ అరెస్టు

చిత్తూరు అర్బన్: నగరంలోని మురుగానిపల్లెలో జరిగిన చోరీ కేసులో మహిళను వన్‌టౌన్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ జయరామయ్య కథనం మేరకు.. మురుగానిపల్లెకు చెందిన సుజాత అనే మహిళ ఇంట్లో అదే కాలనీకు చెందిన సుహాసిని (34) పనిచేస్తోంది. గతనెల ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇంట్లో పనిచేస్తున్న సుహాసిని ఈ చోరీకి పాల్పడ్డట్లు గుర్తించి, ఆమె నుంచి 29 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ చేసి అరెస్టు చేశారు. న్యాయమూర్తి ఆదేశాలతో నిందితురాలిని చిత్తూరు జిల్లా జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

వైద్యవిద్య మరింత భారం..



నీట్ రాసి వైద్యవిద్య చదవాలని అందరికీ ఉంటుంది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీటు సాధించాలనే తపనతో నీట్ పరీక్షరాశా. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మెరిట్ విద్యార్థులకు వైద్యవిద్య మరింత భారం కావడం ఖాయం. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరమైతే రూ.కోట్లు ఖర్చుపెట్టి ఎంబీబీఎస్ చదివే స్థోమత నాకు లేదు. ప్రైవేటు చేయకుండా ప్రభుత్వమే నిర్వహిస్తే బాగుంటుంది.

– టి.చిన్నబాబు, నీట్ విద్యార్థి, శ్రీరంగరాజపురం



వైద్య విద్య అందని ద్రాక్షేనా !

మెడికల్ సీట్లు తక్కువగా ఉన్నందున నా ఇద్దరు పిల్లలు బీడీఎస్ ఒకరు, అగ్రికల్చర్ ఒకరు చేశారు. గత ప్రభుత్వం కొత్త మెడికల్ కాలేజీలను పెట్టగానే ఇక మెడికల్ సీట్లు పెరుగుతాయని చాలా సంతోషించాం. పేద పిల్లలకు ప్రభుత్వం మంచి చేసిందనుకున్నా. తీరా ఇప్పుడున్న ప్రభుత్వం వాటిని ప్రైవేటుపరం చేస్తామంటోంది. ఇప్పుడు కోటీశ్వరులు మాత్రమే బిడ్డలను డాక్టర్లు చేసుకోవచ్చు. ఇదంతా చూస్తుంటే ఇక పేద పిల్లలకు వైద్య విద్య అందని ద్రాక్షే సామీ.



– పుష్పరాజ్, తండ్రి, పలమనేరు

కౌండిన్యలో ఇసుక మాఫియా



గుండుగల్లు సమీపంలోని అక్రమ ఇసుక తవ్వకాల వద్ద ఘర్షణ (ఫైల్)

నదిలోని ఇసుకంతా దోచుకో... దాచుకో అన్నట్టు వ్యవహరిస్తున్నారు కూటమి నేతలు. ఇసుక దోపిడీకి తెలుగు తమ్ముళ్లు పోటీ పడుతున్నారు. అధికారంలోకి రాగానే టీడీపీ నేతలంతా ఇసుక మాఫియాలోకి చొరబడి లక్షలు దండుకుంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇసుక స్మగ్లింగ్‌కు పాల్పడిన వేలాదిమంది నాయకులు కోట్లు గడించి బడాబాబులుగా మారారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వీళ్ల ఆటలు సాగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజుల వ్యవధిలోనే మళ్లీ ఇసుక మాఫియా కోరలు చాచింది. ఉచిత ఇసుక మాట దేవుడెరుగు.. అసలు ఇసుకే దొరకని పరిస్థితి సృష్టించేశారు. ఇసుక డంపులన్నీ టీడీపీ గుప్పిట్లోకి చేరాయి. ఇష్టారాజ్యంగా వసూలు చేస్తూ జనాన్ని దోచుకుంటున్నారు.

- పడమటి మండలాల్లో పుట్టుకొస్తున్న ఇసుక డంప్‌లు
- కొల్లగొడుతున్న టీడీపీ నేతలు
- ఒక్కో డంప్‌లో వందలాది లోడ్ల ఇసుక

గంగవరం: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగానే మండలంలోని టీడీపీ నేతలందరూ ఇసుక రీచ్‌ల వైపు పరుగులు తీశారు. అక్కడున్న సచివాలయ సిబ్బందిని బెదిరించి, ఇసుకను వారి సొంత స్థలాల్లోకి తరలించేశారు. అంతే ఇసుక రీచ్‌లన్నీ ఖాళీ అయిపోయాయి. దీంతో ఇసుక కోసం టీడీపీ నేతల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇది సరిపోదని మండలంలోని కౌండిన్య నదిలోని ఇసుకను ఊడ్చేస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్లు ఇసుక తరలించే పనిలో ఉన్నాయి. ఇసుక వేటలో వస్తున్న ఆదాయం చూసి, అధికార పార్టీ నేతలు అందులోకి దిగేశారు. ఇసుక దోపిడీకి పోటీ పడుతున్నారు.

ఇసుక స్మగ్లింగే వృత్తిగా..

ఇసుక లభించే కౌండిన్య నది, నది ఒడ్డున అన్యాక్రాంతమైన భూములను ముందుగా ఆక్రమించుకుంటున్నారు. నదిలో జేసీబీలతో ఇసుకను తోడి ట్రాక్టర్లలో లోడ్ చేసుకుని సొంత గిరాకీలు, బ్రోకర్ల ద్వారా వచ్చే కొనుగోలుదారులకు అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్నారు. ఒక్కొక్కరు నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్లు లీజుకు తీసుకుని రోజుకు దాదాపు పదుల సంఖ్యలో ఇసుక లోడ్లు తరలిస్తున్నారు. ఆదాయం అధికంగా వస్తుండడంతో ఇసుకాసురులు ఈ స్మగ్లింగ్‌నే వృత్తిగా మలుచుకున్నారు. మండలంలోని జీఎల్ఎస్ ఫారం, కూర్నిపల్లి, మేలుమాయి క్రాస్ వద్ద ఏటిగడ్డ, కలగటూరు తదితర గ్రామాలకు దిగువన ఉన్న కౌండిన్య నదిలో ఇసుకను భారీ స్థాయిలో తవ్వి పూర్తిగా ఖాళీ చేసేస్తున్నారు. నది ఒడ్డున అన్యాక్రాంతమైన భూములను ఆక్రమించుకుంటారు. ఆ భూమి దిగువన ఉండే ఇసుక తవ్వకునేందుకు రేట్లు కుదుర్చుకుంటున్నారు. ఒక్క కౌండిన్య నదిలో మాత్రమే కాకుండా మండల శివారు గ్రామాలు గుండుగల్లు, పసుపత్తూరు, గంధ్రాజుపల్లి తదితర గ్రామాల వద్ద చెరువులు, నదులు, అన్యాక్రాంతం భూములను కొల్లగొట్టేస్తున్నారు. గుండుగల్లు వద్ద గతంలో ఇసుక అక్రమ తవ్వకాలపై చుట్టుపక్కల రైతులు నిలదీయడంతో ఇది ఘర్షణకు సైతం దారితీసింది. ఇలా ఇసుక ఉందని తెలిస్తే ఏదో రకంగా దాన్ని తవ్వి తమ గుప్పిట్లోకి తెచ్చుకుంటున్నారు. గ్రామాలు ఆనుకుని పంట పొలాలు, మరుగుల ఉండే బీడు భూములు వద్ద భారీ మొత్తంలో ఇసుక లోడ్లు అక్రమార్కులు డంప్ చేశారు. గంగవరం బైపాస్, మబ్బువారిపేట, కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో ఇసుక డంప్‌లు దర్శనమిస్తున్నాయి.

వారే దోచుకోవాలట

అధికార పార్టీ వర్గీయులే ఇసుకను దోచుకోవాలి తప్ప ఇతరులు ఇసుక తరలిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ముందుగానే వారు హుకుం జారీ చేశారు. వారికి పోలీసులు, రెవెన్యూ అధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారు. అధికార పార్టీ కాకుండా మరెవరైనా ఇసుక తరలిస్తుంటే వెంటనే అధికారులు రంగంలోకి దిగుతున్నారు. లేకుంటే టీడీపీ నేతలే అధికారులకు సమాచారమిచ్చి వారి ట్రాక్టర్లను పట్టి సీజ్ చేయిస్తున్నారు. ఒకవేళ అధికారులు, పోలీసులు స్పందించకపోతే టీడీపీ నేతలే నేరుగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. తద్వారా టీడీపీ నేతల ఇసుక స్మగ్లింగ్‌కు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూసుకుంటున్నారు.

తరలింపునకు పక్కా ప్లాన్

ఇసుక దోపిడీదారులు పక్కా ప్లాన్ ప్రకారం రూట్ మ్యాప్ వేసుకుని ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. అధికారుల నుంచి ఎలాంటి అడ్డంకులు ఎదురుకాకుండా అందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దారిలో అధికారులు ఎవరైనా ఇసుక రవాణాను అడ్డుకుంటారేమో అని గ్రహించి ముందు జాగ్రత్తగా తవ్వకాలు చేసే చోట, రోడ్డులోకి ప్రవేశించే చోట, రహదారికి నలువైపులా తమ మనుషులను పెట్టుకుని మ్యానేజ్ చేస్తారు. ఒకవేళ అకస్మాత్తుగా ఎవరైనా అధికారులు ట్రాక్టర్లు, జేసీబీలను పట్టుకుంటే అధికార బలంతో కేవలం గంటల వ్యవధిలోనే రిలీజ్ చేసుకుంటారు. ఇటీవల పక్కా సమాచారంతో ఇసుక తవ్వకాలపై పోలీసులు దాడులు చేసి స్టేషన్‌కు తరలించిన జేసీబీ కొన్ని గంటల తరువాత మళ్లీ యథాస్థానానికి చేరిందంటే ఇసుకాసురుల సత్తా ఏంటో తెలుస్తోంది.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



మండలంలో ఎవరైనా ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు. గంగవరం అర్బన్ పరిధిలోని కౌండిన్య నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్టు అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. అనుమతులు లేకుండా ఇసుకను తరలించిన టిప్పర్లు, జేసీబీని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం. ఎవరైనా సరే ఇసుక అక్రమ రవాణా చేస్తే అలాంటి వారిపై ఉపేక్షణ లేకుండా చర్యలు తీసుకుంటాము. – ప్రసాద్, అర్బన్ సీఐ, పలమనేరు

ఆగని ఇసుక దందా



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

గంగాధర నెల్లూరు: మండలం టీడీపీ నేతల ఇసుక దందాకు అడ్డాగా మారింది. నిత్యం రాత్రుల్లో తెల్ల బంగారంగా పిలిచే ఇసుకను తమిళనాడుకు తరలిస్తూ కోట్లు గడిస్తున్నారు. ఇటీవల నెల్లూరు నుంచి చెన్నైకి తరలిస్తున్న రెండు లారీలను గంగాధర నెల్లూరు పోలీసులు సీజ్ చేసి స్పెషల్ బ్రాంచ్‌కు తరలించారు. శుక్రవారం రాత్రి మండలంలోని తూగుండ్రం జంక్షన్ వద్ద పోలీసులు ఒక ఇసుక ట్రాక్టర్, ఒక ఇసుక లారీని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. 50 టన్నుల గల ఇసుక విలువ సుమారు రూ.5 లక్షల రూపాయలంటుంది. ట్రాక్టర్‌లోని ఇసుక విలువ సుమారు రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు ఉంటుంది. అయితే ఇసుక తరలిస్తున్న లారీపైకానీ, ట్రాక్టర్‌పై కానీ ఎలాంటి కేసు నమోదు చేయలేదు అంటే ఆ ప్రజాప్రతినిధి అధికారులపై ఎంత ఒత్తిడి చేస్తున్నారన్న విషయం అర్థమవుతుంది. పట్టుకున్న అధికారులను బెదిరిస్తూ ఇసుకాసురులు తమ జులుం ప్రదర్శిస్తున్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 3629 కేసుల పరిష్కారం

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఉమ్మడి జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 3,629 కేసులు పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించడానికి 35 బెంచీలను ఏర్పాటు చేయగా, 9,259 కేసుల పరిష్కారమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొత్తం 3,629 కేసులు పరిష్కరించగా, ఇందులో 3030 క్రిమినల్, 337 సివిల్, 262 ప్రీ–లిటిగేషన్ కేసులు ఉన్నాయన్నారు. కేసుల పరిష్కారంలో జిల్లాకు 6వ స్థానం లభించింది అన్నారు.

సీనియారిటీ ప్రకారం పదోన్నతి ఇవ్వాలి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ ఉద్యోగులకు సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని ఆ శాఖ ఓసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిత్తూరులో శనివారం ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, డిస్కం నూతన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరూ ఐక్యంగా ఉంటూ డిమాండ్ల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ విధానం అమలు చేయాలన్నారు. క్యాచ్‌అప్ విధానంపై 1986 నుంచి పోరాటాలు చేస్తే ఈపీఎస్పీడీసీఎల్, జెన్‌కోలో వాటిని అమలు చేశారన్నారు. వీటిని ఏపీఎస్పీడీసీఎల్‌లో కూడా అమలు చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఓసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

కార్యవర్గం ఏకగ్రీవం

విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర, డిస్కం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపికచేసుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీధర్‌వర్మ, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులురెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పండుదొర, కార్యదర్శులుగా పరిపాలనకు వెంకటేశ్వర్లు, ఆర్థికపరంగా సురేష్‌కుమార్, సమన్వయానికి మురళీకృష్ణను ఎంపిక చేసుకున్నారు. డిస్కం అధ్యక్షుడిగా వాసుదేవరెడ్డి, కార్యదర్శిగా సతీష్, ఉపాధ్యక్షుడిగా గంటారావు, కోశాధికారిగా వసంతనాయుడు ఏకగ్రీవమయ్యారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలు జిల్లాల ఉద్యోగులతో పాటు చిత్తూరు జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు, ఈఈ మునిచంద్ర, జిల్లా నాయకులు శేషాద్రిరెడ్డి, చంద్రమౌళిపిళ్లై, చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో 'కూటమి' తట్టలు!

తిరుమల : శ్రీవారి సన్నిధిలో నయా దందాకు కూటమి నేతలు శ్రీకారం చుట్టారు. కొండపై అనధికారికంగా వ్యాపారాలు ప్రారంభించారు. అధిక రద్దీ ఉండే ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా దుకాణాలు పెట్టేశారు. అలిపిరి నుంచి తిరుమలలోని అఖిలాండం వరకు అనేక చోట్ల అనధికార హాకర్ల అవతారం ఎత్తేశారు. సాధరణంగా తిరుమలలో వ్యాపారం చేయాలంటే టీటీడీ నుంచి తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలి. ఈ మేరకు ప్రతినెలా టీటీడీకి ఫీజు చెల్లించాలి. అయితే కొందరు కూటమి నేతలు తిరుమలలో దందాలకు దిగేశారు. పుట్టగొడుగుల్లా అనధికార హాకర్‌లను పుట్టించేశారు. ఈ క్రమంలో శ్రీవారి ఆలయానికి అభిముఖంగా ఉన్న అఖిలాండం వద్ద నాలుగు, డీబీఆర్ రోడ్డులో షెడ్డుకు అనుకుని మరికొన్ని దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇక వరాహస్వామి అతిథిగృహం వద్ద మరికొందరు అనధికార హాకర్లు తట్టలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇక అలిపిరి నుంచి గాలి గోపురం మధ్యలో జనసేన, టీడీపీ నేతలు రెండు దుకాణాలను అనధికారంగా పెట్టినట్లు సమాచారం. కూటమి నేతల పేర్లు చెప్పుకుని ఆయా దుకాణాలను ఏర్పాటు చేయడం గమనార్హం. దీనిపై స్థానిక వ్యాపారులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. తమ దుకాణాలకు అద్దె చెల్లిస్తుంటే, కూటమి నేతలు మాత్రం అధిక రద్దీ ఉండే ప్రాంతాల్లో షాపులు పెట్టుకుని పైసా కూడా టీటీడీకి కట్టడం లేదని ఆరోపిస్తున్నారు. కొండపై సుమారు 13 దుకాణాలకు పైగా కూటమి నేతల కనుసన్నల్లో వెలిసినట్లు వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి అనధికార తట్టలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.